క్లుప్తంగా

▸ ప్రభుత్వ భూమి ఆక్రమిస్తే చర్యలు

చంద్రగిరి(తిరుపతి రూరల్): ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని చంద్రగిరి తహసీల్దార్ శిరీష హెచ్చరించారు. చంద్రగిరి మండలం మిట్టపాలెం గ్రామ లెక్కదాఖల, బుచ్చినాయుడు పల్లి సర్వే నంబర్ 1లో 12 సెంట్ల భూమిని గ్రామానికి చెందిన ఓ మహిళ ఆక్రమించుకున్న దానిపై మంగళవారం అధికారులతో కలిసి పరిశీలించారు. మిట్టపాలెం గ్రామ పరిసరాల్లో సర్వే నంబర్1లో ఆరు ఎకరాల కాలవ పొరంబోకు స్థలం ఉందని, ఈ భూమిలో ఎవరు ప్రవేశించరాదన్నారు. ప్రభుత్వ భూమికి కంచె ఏర్పాటు చేస్తామన్నారు. ఆర్ఐ సుశీల, వీఆర్వో విష్ణు, సర్వేయర్ విష్ణువర్ధన్ ఉన్నారు.

▸ చట్టాలపై అవగాహన అవసరం

చంద్రగిరి(తిరుపతి రూరల్): చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ అన్నారు. పనపాకం దళితవాడలో మంగళవారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా బాల్యవివాహాలు జరుగుతుంటాయని, వీటిని నిరోధించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. వైస్ ఎంపీపీ వెంకటరత్నం పాల్గొన్నారు.

▸ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పాకాల: పర్యావరణ పరిరక్షణ, మొక్కల పెంపకాన్ని అందరూ బాధ్యతగా తీసుకోవాలని ఎఫ్ఎస్ఓ భారతి కోరారు. మంగళవారం లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, విద్యుత్, గ్యాస్‌ను పొదుపుగా వినియోగించాలన్నారు. సర్పంచ్ ఎస్.కస్తూరితో కలిసి మొక్క నాటారు. వలంటీర్లతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు.

వెంకన్న చెల్లి.. గంగమ్మ తల్లి



పసుపు కొమ్ముల అలంకరణలో గంగమ్మ



ఆలయంలో ఎమ్మెల్యే భూమన, ఎమ్మెల్సీ సిపాయి

- తాతయ్యగుంట గంగమ్మకు మరు పొంగళ్లు
- భక్తులతో కిక్కిరిసిన ఆలయం



భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయం

తిరుపతి కల్చరల్: వెంకన్న చెల్లి గంగమ్మ తల్లీ కరుణించి కాపాడు అంటూ భక్తులు గంగమ్మను ప్రార్థించారు. తాతయ్యగుంట గంగమ్మ జాతర తర్వాత వచ్చిన రెండో మంగళవారం సందర్భంగా భక్తులు ఆలయంలో మరు పొంగళ్లు పెట్టారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వివిధ వేషాలు ధరించి వేయికళ్ల దుత్తలు నెత్తిన పెట్టుకుని కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. అమ్మవారి మూలవిరాట్టు విగ్రహానికి అభిషేకం చేశారు. శుభ సూచికమైన పసుపు కొమ్ములతో సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, వైఎస్సార్‌సీపీ నేతలు గంగమ్మకు పూజలు చేశారు. ఆలయ పాలక మండలి చైర్మన్ కట్టా గోపియాదవ్, ఈఓ మునిక్రిష్ణయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు. రాయలసీమ రంగస్థలి కళాకారులు వివిధ వేషాలతో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

జగనన్న పాలన ఓ చరిత్ర

తిరుపతి మంగళం: ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు అందించిన నాలుగేళ్ల పాలన దేశ రాజకీయ చరిత్రలోనే చిరస్థాయిగా నిలిచిపోతుందని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా మంగళవారం తిరుపతిలోని తన కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. తండ్రి ఆశయాలను అందిపుచ్చుకుని పేదల సంక్షేమానికి నిరంతరం తపిస్తున్న గొప్ప నాయకుడు జగనన్న అన్నారు.

తిమ్మినాయుడుపాళెంలో గంగజాతర

- అమ్మవారికి సారె సమర్పించిన ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి



గంగమ్మకు సారె తీసుకొస్తున్న ఎమ్మెల్యే భూమన

తిరుపతి మంగళం: తిరుపతి 50వ డివిజన్ తిమ్మినాయుడుపాళెం హరిజనవాడలో మంగళవారం గంగజాతర నిర్వహించారు. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కార్పొరేటర్ బోకం అనీల్‌కుమార్‌తో కలిసి అమ్మవారికి సారెను సమర్పించారు. ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు కుప్పయ్య, గణేష్, యువరాజ్ పాల్గొన్నారు.

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి ఇందిరమ్మ కాలనీలో గంగ జాతర సందర్భంగా ప్రత్యేక పూజలు, కార్యక్రమాలు జరిగాయి. భక్తులు అమ్మవారికి అంబలి, పొంగళి నైవేద్యం సమర్పించారు.

గంగమ్మకు సారె సమర్పణ



సారె తీసుకొస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతిరూరల్/భాకరాపేట/పాకాల: తిరుపతి రూరల్ మండలం పద్మావతీపురం, వేదాంతపురం పంచాయతీ వినాయకనగర్, పెరుమాళ్లపల్లి పంచాయతీ లక్ష్మీచెరువు, చిన్నగొట్టిగల్లు, పాకాల గాంధీనగర్ గ్రామాల్లో మంగళవారం జరిగిన గంగమ్మ జాతర్లలో చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సందడి చేశారు. తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి పట్టువస్త్రాలు తీసుకెళ్లి జాతర జరిగే గ్రామాల్లో గంగమ్మకు సమర్పించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. వినాయకనగర్‌లో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

కోదండరామస్వామి ఆలయ భూముల పరిశీలన

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి పట్టణంలోని శ్రీకోదండ రామస్వామి ఆలయ భూములను టీటీడీ రెవెన్యూ అధికారులు మంగళవారం పరిశీలించారు. ఆక్రమణలను తొలగించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఇంజినీరింగ్ అధికారులతో చర్చించారు. ఆలయ భూముల చుట్టూ ప్రహరీ నిర్మించనున్నట్లు తెలిపారు. చంద్రగిరి మెయిన్ రోడ్డు నుంచి ఆలయం వరకు రెండు ఆర్చీలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. టీటీడీ ఇంజినీరింగ్ ఏఈ వెంకటేశ్వర్లు, సర్వేయర్ నాగరత్నమ్మ, యామిని పాల్గొన్నారు.

భూమనకు వినాయకనగర్ వాసుల కృతజ్ఞతలు

తిరుపతి మంగళం: తమ ప్రాంతంలో సీసీ రోడ్లు, మౌలిక సదుపాయాలు కల్పించిన ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డికి శెట్టిపల్లి వినాయకనగర్ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు హహ్‌షాద్ సయ్యద్, స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం పద్మావతిపురంలోని ఎమ్మెల్యే నివాసంలో ఆయన్ను కలిశారు.

ఎమ్మెల్యే పెళ్లి కానుక అందజేత

చంద్రగిరి(తిరుపతి రూరల్): ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అందిస్తున్న పెళ్లి కానుకను చంద్రగిరి ఆకుతోటవీధి, రెడ్డివారిపల్లె గ్రామాల్లో వివాహం చేసుకోనున్న జంటలకు మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకులు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, ఎంపీటీసీ మాధవరెడ్డి, నాయకులు కుప్పిరెడ్డి, జ్యోతి ప్రసన్న, రేవతి పాల్గొన్నారు.

ఉద్రిక్తత నడుమ దహనక్రియలు

రామచంద్రాపురం: మండలంలోని గడ్డకింద ఏఏడబ్ల్యూ గ్రామానికి చెందిన వసంతమ్మ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని గ్రామ సమీపంలోని పుల్లకుంట శ్మశానవాటికకు దహనక్రియల కోసం తీసుకెళ్లారు. అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి శ్మశానవాటిక స్థలం తనదంటూ దహన క్రియలు అడ్డుకున్నారు. దీంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. రెవెన్యూ అధికారులు, ఎస్ఐ గిరిబాబు సంఘటనా స్థలానికి చేరుకుని దహనక్రియలు సజావుగా జరిగేటట్లు చర్యలు తీసుకున్నారు.

నాలుగేళ్ల వేడుక



కేక్ కట్ చేస్తున్న ట్రస్ట్ చైర్మన్ పీసీ రాయులు

తిరుపతి కల్చరల్: ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా సుపరిపాలన అందిస్తూ నాలుగు వసంతాలు దిగ్విజయంగా పూర్తి చేసుకున్న సంక్షేమ సారథి సీఎం జగనన్న అని వైఎస్సార్ ప్రజా సేవా ప్రస్థానం ట్రస్ట్, కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ చైర్మన్ పీసీ.రాయులు కొనియాడారు. ముఖ్యమంత్రిగా జగనన్న నాలుగేళ్లు, ప్రధాని మోదీ తొమ్మిదేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా గాంధీ రోడ్డులోని ట్రస్ట్ కార్యాలయం వద్ద స్వీట్లు పంచిపెట్టి సంబరాలు చేసుకున్నారు.